# సీత నోచిన నోము

అందె నారాయణస్వామి

కథానిక

రంగయ్య చిరాకుపడుతున్నాడు. చుట్టూ సగం తయారయిన కుర్చీలూ, పెట్టెలూ వున్నవి. "పెట్టె తయారయిందా రంగయ్యమావా?" అంటూ బసవయ్య వచ్చాడు.

"కూచో బసవయ్యా! తొందరగా తయ్యాల తొట్టి ఒకటి అందించవలసి వచ్చింది. నీ పెట్టె రేపు పూర్తిచేసి యిస్తాను" అన్నాడు రంగయ్య.

బసవయ్య యెదురుగా బల్లమీద కూర్చుని "మాదిమాత్రం తొందరకాదా యేంటిమావా? పిల్ల రేపు అత్తగారింటికి వెళుతూవుంటే యెప్పుడు తయారుచేసిస్తావు యేమిటి" అని అడిగాడు.

"అంతా తయారయింది; తలుపూ బందులూ పెట్టాలి. రేపటికి యిస్తే సరనుకో. యేంచెయ్యను బసవయ్యా! ఒంటిరెక్కపాటు. చేతికింద ఆదరువుగా వుంటాడుగదా అని వీణ్ణి పనిలో పడవేస్తే వళ్లు వంగితేనా? మా శంకరంగాడు మీ యిళ్ళవైపు యేమైనా వచ్చాడా?" అని అడిగాడు రంగయ్య.

"రాలేదు మావా" అన్నాడు బసవయ్య.

"బడి బండలుచేసి తిరుగుతుంటే పనిలోపడేశాను. వాడికి వళ్ళువంగితేనా బసవయ్యా! తిరిగే కాలూ తిట్టేనోరూ అగుతుందా క్షణం కాలు నిలవదు, కుక్కకు టెంకాయదొరికినట్టు సైకిలొకటి దొరికింది వాడికి. అదివేసుకుని వూరంతా బలాదూరు తిరుగుతుంటాడు" అన్నాడు రంగయ్య.

"తిరగడానికి కాకపోతే నువ్వు సైకిలు యెందుకు కొనిపెట్టింది వాడికి, మావా?" అని అడిగాడు బసవయ్య.

"సైకిలు కావాలని ఒకరోజల్లా కూడుతినకుండా మారాంచేస్తుంటే, ఒకచెంపన తల్లి కొని పెట్టమని గోలపెడుతుంటే పాతదొకటి కొని పెట్టాను. జ్ఞానం వుండొద్దూ చిన్నవాడా చితకవాడా బసవయ్యా! పద్దెనిమిదేళ్లు పైబడ్డయి. ఒంటిరెక్కపాటు; కరువు పీల్చిపిప్పిచేస్తూవుంది. రూపాయితీసికెళ్తే దోసిట్లోకి గింజలురావయ్య"

"వాడికేం పనిచెయ్యాలని? నువ్వున్నంతవరకు మహారాజే"

"నేను పోయ్యాకగాని వాడిపాట్లు కనపడవు. సరేగాని బసవయ్యా! కందులు తెచ్చిపెడతానన్నావు యెయ్యి?"

"గోతం విప్పలేదు రేపు తెచ్చిపెడతాలే మావా."

"మీకేం మహారాజులు. మట్లో మానెడు, యింట్లో పుట్టెడు. మాబోటివాళ్ళం చచ్చిపోతున్నాం. యేం కరువు! యేం కరువు! గింజలు రోజుకో గిద్దెడు లాగేస్తున్నారు."

"కరువు మీకొక్కళ్ళకే కాదు మావా! అందరికీ వచ్చింది. గింజలు పండితే మేంమాత్రం తతిమ్మా వస్తువులు కొనడంలా? అన్నిటికీ ధరలు పెరిగినైగా? వెనక నాలుగు రూపాయలు మజూరియిచ్చే పెట్టెకు యిప్పుడు పదిరూపాయలంటే యివ్వడంలా?"

"యిప్పుడు పదిరూపాయలు పుచ్చుకున్నా కడుపు నిండడంలా. నాలుగురూపాయలు మజూరి యిచ్చినప్పుడే బాగుంది. రూపాయకు నాలుగు శేర్ల బియ్యం యిచ్చేవాళ్లు. అయితే అప్పటి మనుషులే అప్పటి పంటేగదా బసవయ్యా! యెందుకు గింజలిట్లా మండిపోవడం?"

"వెనకటికంటే యిప్పుడు జనాభా చాలా పెరిగిపోయిందట మావా. మనకు పండేపంట చాలకపోవడంవల్ల గింజ కరువైంది"

"అయితే చచ్చేవాళ్ళకంటే పుట్టేవాళ్ళే జాస్తన్నమాట."

"ఆహా! గింజ చాలకపోవడంవల్ల చాలినంత పంట వుత్పత్తిచేయించాలని ప్రభుత్వం యెక్కువ పండించే రైతులకు బహుమతు లిస్తున్నారు గూడా. మా తోడల్లుడికి ఈ సంవత్సరం వెయ్యి రూపాయలు బహుమతి వచ్చింది."

"అట్లాగా!"

వాకిటిముందు సైకిలుగంట మోగింది. శంకరం వచ్చాడు. అతడ్ని చూచేసరికి తండ్రికి కోపం వొచ్చింది. యిట్లాగే తిరుగుతూ వుండగా రంగయ్య లోగడ ఒకసారి చెయ్యిచేసుకునేసరికి శంకరం పారిపోయి నాలుగురోజులకుగాని తిరిగి యింటికిరాలేదు. అప్పటినించి రంగయ్య కొట్టడం మాని కళ్ళెబెదుర్కే లాక్కొస్తున్నాడు. "వెధవ యెక్కడ వూరేగుతున్నావు?" అని తండ్రి కేకలు పెట్టగా శంకరం సైకిలు వసారాలో వదిలి అక్కడ నిలవకుండా వంటగదిలో వున్న తల్లిదగ్గరకెళ్ళి నక్కాడు.

"ఒకపని చెయ్యి మావా! వీడికి సైకిలు అంట గట్టినట్టు ఓ పిల్లను చూసి ముడిపెట్టు. ఆవిడ అది తీసుకురా, యిది తీసుకురా అని లేస్తే తన్ను కూనుంటే తన్ను తంతుంటే అప్పుడుగాని వీడికి ఒళ్ళువంగదు" అన్నాడు బసవయ్య.

"అది ఒకటే తక్కువ వెధవకు" అన్నాడు రంగయ్య.

తమ సంతానానికి పెండ్లిచెయ్యడం తల్లిదండ్రుల ముఖ్యబాధ్యతలలో ఒకటి. శంకరానికి తల్లిదండ్రులు పెండ్లిచెయ్య నిశ్చయించారు. దగ్గర పల్లెలోనే పిల్ల కుదిరింది, పెళ్ళంటే యెవరికి సంతోషం కలగదు? శంకరం తన పెళ్ళిసంగతి విని వుప్పొంగి పోయ్యాడు. పెండ్లికొడుకు కట్నాలు కానుకలపట్ల అత్తవారియెడల ఉదారంగానే నడుచుకున్నాడు కొత్త సైకిల్ ఒకటి మాత్రం కోరుకున్నాడు. రంగయ్య వున్నవాడేమీ కాదు. ఇల్లు తప్ప మరేఆస్తీలేదు. పెళ్ళినిమిత్తం ఓ షావుకారుదగ్గర ఐదువందలు అప్పుతెచ్చారు. పెండ్లిజరిగిపోయింది. పెండ్లి కావడంతోనే సీత కాపరానికొచ్చింది.

శంకరంపని వెనకటికంటే మంచివాటంగా వున్నది. ఊళ్ళోతిరగడానికి కొత్తసైకిలు, ఇంట్లో విలాసంగా గడిపేటందుకు భార్య అమిరి పోయారు. వెనక ఒక్కడికే ఋణం పెడుతు న్నాననుకుంటే రంగయ్య ఇప్పుడు మొగుడూ పెళ్ళాం ఇద్దర్నీ పోషించవలసి వచ్చింది.

సీత సంవత్సరం తిరగడంతోనే గర్భవతై మగ శిశువును కన్నది. అసలుకంటే వడ్డే ముద్దన్నారు. రంగయ్య మనమణ్ణిచూసుకుని మురిసిపొయ్యాడు. కొడుకుమీద కోపంనిలవలేదు. వెంటనే పరితనంగా ఉయ్యాలతొట్టి తయారుచేసి అందులో మనవణ్ణి పడుకోబెట్టినాడు. పిల్లవాడికి మూడోమాసం వచ్చింది. ఇక అట్లయినా కొడుకు ఒళ్ళువంచి పని చేస్తాడని రంగయ్య వడ్రంగం సామాను, పాతిక రూపాయలు రొఖం యిచ్చి మీయంతటమీరు బతకండని కొడుకూ కోడల్ని వేరేవుంచాడు. శంకరం తనను వేరేవుంచినంతమాత్రాన బ్రతకంతే దెవరు అన్నధీమాతో తండ్రియిచ్చిన పాతిక రూపాయలు పెట్టి కర్రకొని కుర్చీలుచేశాడు. అవి అమ్మివచ్చిన డబ్బు అయిపోయిందాకా మళ్ళాపని ముట్టుకోలేదు. కడుపులో కాలుతున్నప్పుడు పట్టు పట్టుమంటే పనియెక్కడనించి వస్తుంది? కర్ర తెచ్చి పనియిట్లు చేద్దామా అంటే చేతిలో కానీలేదు. తండ్రినడిగితే యివ్వడు. శంకరం అత్తవారు చూద్దామా వాళ్ళదీ పేదసంసారమే. ఒకరోజల్లా మొగుడూపెళ్ళాంపస్తున్నారు. అదిచూసి శంకరంతల్లి సహించలేక భర్తకి తెలియకుండా యిద్దరికీ తిండిపెట్టింది.

ఆ మర్నాడు శంకరం భార్యతో "చేతిలో డబ్బులేకపోతే యెవరయినా యేం సంపాయించగలరు? లక్షలు సంపాయించిన వాళ్ళంతా డబ్బుకోసం ముందు యిలా అవస్థలు పడ్డవాళ్ళే, నీ మెళ్ళో గొలుసు తీసియివ్వు అమ్మి కర్రకొని వ్యాపారం సాగిస్తాను. యిక తర్వాత చూసుకో! రెండోనెల్లోనే మళ్ళా నీగొలుసు చేయిస్తాను వీడు యింతటివాడనుకోలేదని మా ముసలిముండా వాడు ముక్కుమీద వేలువేసుకోకపోతే అప్పుడను" యిట్లాచెప్పి శంకరం భార్యను నమ్మించి మెళ్ళో గొలుసు తీసికెళ్ళి అమ్మగా యెనభై రూపాయిలు వచ్చినవి సగండబ్బుపెట్టి కర్రను తెచ్చాడు. యిరవైరూపాయలు కాఫీహోటలు వాడు తొందరచేస్తుంటే ఇచ్చి తతిమ్మా యిరవై రూపాయలు చిల్లర ఖర్చుకు వుంచుకున్నాడు. తెచ్చినకర్ర పెట్టి చేసిన సామాను అమ్మగా వచ్చిన డబ్బు నెలరోజులకంటే యెక్కువరాలేదు. ఆనెల రోజులూ షడ్రసోపేతంగా తిన్నారు. చేతిలో డబ్బువుండగా పనిచేసే అలవాటు అతనికిలేనేలేదు. తర్వాత మళ్ళాకష్టలు వుంటూంటే చాటుగా తల్లి పెడుతూ వచ్చింది.

ఇంతలో ఒక దుర్ఘటన జరిగింది: రంగయ్య పనిచేస్తూండగా ప్రమాదవశాత్తు కాలుమీద బాడితె పడి మధుమేహం వుండడంవల్ల మరణించాడు.

* * *

తండ్రి పోవడంతోనే కుటుంబ భారమంతా శంకరం నెత్తిన పడ్డది. తల్లిని పోషించే భారం కూడా అతనిమీదనే పడ్డది. తెల్లవారిలేస్తే ఇంటి ఖర్చుకు రోజుకు కనీసం రెండురూపాయలైనా కావాలి. పని చెయ్యంది యెక్కడనించి వస్తుంది? తండ్రి చనిపోవడంతోనే శంకరం పెండ్లికి అప్పు తెచ్చిన షావుకారు బాకీకి తొందర చెయ్యగా ఇల్లు అతనికి తాకట్టు పెట్టి ఆపారు. శంకరం సామానులు చేసియిస్తానని వాళ్ళదగ్గరా, వీళ్ళ దగ్గరా ముందు డబ్బుతీసుకుని వాళ్లు వచ్చినప్పుడు శంకరం యింటివద్ద లేకపోవడంవల్ల వాళ్ళు అరచి పోవడం, ఒకపూట తింటే ఒకపూట మాడడం, ఇట్లా రోజులు వెళ్ళిపోతున్నవి.

ఒకరోజున బసవయ్య వాళ్లయింటికి వచ్చాడు. రంగయ్యకూ, బసవయ్యకూ యెంతో పరిచయం, ఆ పరిచయాన్ని పురస్కరించుకొని పరామర్శించడానికి వచ్చాడు. శంకరం తిరిగితిరిగి అప్పుడే యిల్లుచేరుకున్నాడు. శంకరంతల్లి భర్తవుండగా ఒకపూటకూడా లేదనుకోకుండా సుఖంగా గడిపిన ఘటం. ఆమె బసవయ్యతో వున్న పరిస్థితులు చెప్పుకుని కంట తడిపెట్టింది. బసవయ్య శంకరాన్ని మందలించగా శంకరం "యేంచెయ్యను బావా! నేను చాకిరీ చేస్తునే వున్నాను. పొదుపుగా జరుపుకోవడం ఆడవాళ్ళలో వున్నదిగాని యెంత తెచ్చినా ధ్వంసం చేస్తుంటే మగవాడెక్కడనించి తెస్తాడు? ముసలిముండావాడు పోతూపోతూ రాకాసి నొకదాన్ని అంటగట్టి పొయ్యాడు" అని బదులు చెప్పాడు.

ఆ మాటలువిని బసవయ్య "అసలు నీకు పెళ్ళి చెయ్యడమే ముసలాయన తప్పులే" యీ మాట మాత్రం అని ఇంటికివెళ్ళి పడ్డబస్తా ఒకటి తోలాడు.

ఒకళ్లు చేసిన సహాయం యెంతవరకు వస్తుంది. బస్తాగింజలు కాగానే మళ్ళా యెప్పటిమామూలే. పస్తులు చెయ్యలేక శంకరంతల్లి కూతురుగారింటికెళ్ళిపోయింది. శంకరంభార్య ఉత్తమురాలు వున్నప్పుడు పొంగి, లేనప్పుడు సంసారాన్ని వెల్లడిచేసుకునేబాపతు కాదు. భర్తతోనే ఉండి మానుషానికి ప్రమగ్గుతున్నది.

ఆరోజున శంకరం బజారునించి వస్తూ చేత్తో యేదో పొట్లాంపట్టుకు వచ్చాడు. కృష్ణుడు అంబేడుతున్నాడు. సీత మళ్ళా గర్భవతిగా వున్నది. శంకరం వచ్చేసరికి సీత పొయ్యిదగ్గర కూర్చుని అన్నం వండుతున్నది. శంకరం ఆమె దగ్గరగా పెట్టిమీద కూర్చుని తెచ్చిన పొట్లంవిప్పి నోటకొట్టుకుంటున్నాడు. సీత చూసి తనకుకూడా పెడతాడని ఆశపడ్డది. పాపం! అందులో గర్భవతాయె. శంకరం తింటూవుండగా ఒకటి రెండు బూందిసీగింజలు క్రిందపడగా అప్పటికప్పుడేవాటిని చీమలు లాక్కెళ్లుతున్నవి. భర్త తినేదేమిటో తెలుసుకోగానే సీతకు మరీ నోరూరింది. కాని యేంలాభం? ఆమెకు పెట్టకుండానే శంకరం మొత్తం మిఠాయి తినివేసి వుత్తకాగితం వుండచుట్టి గిరవాటువేస్తూ "యేంకూర తెచ్చావు" అని అడిగాడు.

"ఏమీ తేలేదు" అని బదులు చెప్పింది సీత.

"పావలా యేంచేశావు?" అని గద్దించాడు శంకరం.

"పెరుగుమనిషి గోలచేస్తుంటే బాకీ కింద యిచ్చాను" అన్నది సీత.

"కూరతెమ్మని పావలాయిచ్చి వెళితే నిన్ను పెరుగుదాని కెవడివ్వమన్నాడు?" అంటూ పట్టరాని ఆగ్రహంతో సీతను పట్టుకుని నాలుగు బాదాడు. ఆ కల్లంతుకు పొరుగింటి అవ్వ వచ్చి "వట్టిమనిషైనా కాదు బంగారంవంటి బిడ్డను పట్టుకుని అట్లా కొడతావెందుకురా మాయదారి వాడా!" అని శంకరాన్ని మందలించి సర్దింది.

సీత ప్రసవించింది. మళ్ళా మగశిశువు కలిగాడు. దేశమాత తన ప్రతి సంతానాన్ని తనను వుద్ధరించటందుకే వాంఛిస్తుంది. కన్నతల్లిదండ్రులు తమను వుద్ధరిస్తాడని విశ్వసిస్తారు. పుట్టిన శిశువు పెరిగి సమర్థుడై అటు దేశమాతనూ, యిటు కన్నవాళ్ళనూకూడా వుద్ధరించవచ్చు లేదా అసమర్థుడై యిద్దరికి కొరగానివాడై పోనూవచ్చు క్షేత్రాన్ని బట్టి విత్తనం ఫలితాన్ని యిస్తుంది.

కొడుకు పుట్టగానే శంకరం సైకిల్ తాకట్టు పెట్టి కొంతడబ్బుతెచ్చి యెట్లాగో పురుడు వెళ్లబుచ్చాడు.

శంకరానికి వడ్రంగం పనిమీద రోతపుట్టింది. వ్యాపారంచేసి బాగుపడాలిగాని, కాయకష్టం వల్ల బాగుపడ్డవాళ్ళెవరున్నారు? అని తలచి బస వయ్యదగ్గరకు వెళ్ళి వ్యాపారం పెట్టుకుంటాానని వందరూపాయలు అప్పు తీసుకునివచ్చి నేతచీరెలు కొని దాపులో వున్న విజయవాడ తీసుకెళ్ళి ప్రతి పేట తిరిగి అమ్మడం ప్రారంభించాడు. ఒకటి రెండురోజులు తిరిగి అమ్మడం, తర్వాత ఇల్లు చేరుకోవడం, యిట్లా సాగిస్తున్నాడు.

శంకరం వ్యాపారంపెట్టిన వేళా విశేషంవల్ల లాభకరంగానే వున్నదిగాని ఏంలాభం? విజయవాడలో రాజా కేఫ్ అతణ్ణి ఆకర్షించింది. అందులోని కోడిపలావ్ నాలుకకు రుచి తగిలింది. అక్కడ వున్నన్నాళ్ళూ రాజా కేఫ్‌లోనే భోజనం-చీరలు అమ్మగా వచ్చిన లాభానికీ, పెట్టే ఖర్చుకూ సరిపోతున్నది. ఇంటివద్ద భార్యా, పిల్లలూ యెప్పటికీ పస్తులే. ఆదాకుమించిన ఖర్చు అయితే ఆ వ్యాపారం యెన్నాళ్లు నిలుస్తుంది? పెట్టిన ఆరుమాసాలకల్లా ఏనుగుమింగిన వెలగపండులా పెట్టుబడిడబ్బుగూడాహరించిపోయింది.

తెల్లవారిలేస్తే తిండికి కావాలి; తను పూరుకున్నా ఇంటివద్ద భార్యాబిడ్డలు వూరుకోరుగా! తన సైకిల్ అమ్మేసి తాకట్టు బాకీపోను వచ్చిన డబ్బుతో నెలరోజులు గడిపాడు. వడ్రంగం అంటే అదివరకే రోత పుట్టిందిగాన శంకరం తర్వాత క్లబ్బులో జవానుగా కుదిరాడు. శంకరం బనియను, లుంగీతో క్లబ్బులో చీట్లపేక ఆడేవాళ్ళకు సోడాలూ, సిగరెట్లు మొదలైనవి అందిస్తూ వుంటాడు. వచ్చే జీతం కొంచమైనా చీట్లాటలో గెలిచినవాళ్ళను, చెయ్యిచాపితే వాళ్ళు బేడో పావలో రాలిపితే దానితోనే శంకరం సంసారం వెళ్ళబుచ్చుతున్నాడు.

సంపాదన లేకపోయినా శంకరానికి సంతానానికి లోటులేదు. శంకరానికి ఇప్పుడు ఐదుగురు పిల్లలు. నలుగురు మగపిల్లలూ, ఒక్క ఆడపిల్ల. పెద్దవాడు కృష్ణుడికి తొమ్మిదేళ్లు. రెండోవాడు రంగడికి ఏడేళ్లు. మూడో పిల్ల లక్ష్మికి అయిదేళ్లు. నాలుగోవాడు రామూనికి మూడేళ్ళు. అయిదోవాడు సుందరం యేడాది పిల్లాడు. పిల్లలకు చదువు సంధ్యా ఆలనా, పాలనా యేమీలేవు. యెప్పుడూ తిరుగుతూ వుంటారు. తండ్రి అసలు పిల్లలను పట్టించుకోడు. కృష్ణుణ్ణి ఆరో యేట బడికి పంపితే వాడు పలక పగలగొట్టుకునిరాగా యెందాకా నీకు పలకలుకొనిపెట్టేదని తండ్రి వాణ్ణిపట్టుకుని చావచితుకకొట్టాడు. పలకలేక అంతటితో వాడు బడికి వెళ్ళడం మానేశాడు. రెండోవాణ్ణి అసలు బడికి పంపనే లేదు. వూళ్ళో యెక్కడ కాస్త మేళం మ్రోగినా దాని వెంటపడి తిరగడం పిలవని భోజనాలకు హాజరు కావడం యిట్లా గోచీ మొలతాడు లేకుండా వూరంతా తిరుగుతూ వుంటారు. ఏ వీధిలో చూసినా వాళ్ళే.

పాపం సీత ఆరోగ్యం క్షీణించింది. మనిషి చిక్కిపోయి కాస్త నడిస్తే దడ. అందులో గర్భం. కూర్చున్నదగ్గరనుంచి లేవలేని స్థితిలో వున్నది. భర్త ఏదీ పట్టించుకోడు.

పెద్ద కుర్రవాడు కృష్ణుడు ఎక్కడ తిరుగుతున్నాడోగాని, నాలుగైదు రోజులబట్టి ఇంటికి రావడం మానివేశాడు. తల్లి పోరుపెట్టగా శంకరం వూళ్లో వెతికివచ్చాడుగాని యెక్కడా కనిపించలేదు.

ఆ రోజున శంకరం అప్పుడే క్లబ్బునుంచి ఇంటికి వచ్చాడు. సీత తన కొడుకు యేమైపోయ్యాడో అని కొడుకుని తలుచుకుని కంటతడిపెట్టుకుంటూ ఒక మూల కూర్చున్నది. ఇంతలో పొరుగింటి అవ్వ వచ్చి "వాణ్ణిగురించి యెందుకు విచారపడతావు అమ్మాయీ! రాకవాడెక్కడికి పోతాడుగాని, ముందు నీ ఆరోగ్యాన్ని గురించి జాగ్రత్తపడు. ఒరే శంకరం! పిల్ల కూర్చున్నదగ్గరనుంచి లేవలేని స్థితిలోవుంటే నీకు కాస్తన్నా పట్టందేరా? ఏదయినా లేతలో చూపించుకోకపోతే ముదిరిపోయిన తరువాత అఘోరిస్తావు" అని శంకరాన్ని మందలించి అవ్వ సీతనూ శంకరాన్నీ వెంట పెట్టుకుని ఆసుపత్రికి తీసుకెళ్లింది.

అక్కడ లేడీడాక్టరు సీతను పరీక్షచేసి సంతానం యెంతమందో అడిగి తెలుసుకుని మండిపడుతూ "పాతికేళ్ళు లేవు యింతమంది

పిల్లలు. టీ. బీ. లో దించింది. మీరు అజ్ఞానంతో పెళ్ళిళ్ళు చేసి అన్యాయంగా వీళ్ళ ప్రాణాలు తీస్తున్నారు" అన్నది.

ఇంటికి తిరిగివచ్చి శంకరం సీత విచారంతో చెరి ఒకవైపునా గోడను చేరగిలపడి కూర్చున్నారు. ఇంతలో నలుగురు పోలీసులు కృష్ణణ్ణి వెంటబెట్టుకుని వచ్చారు. కృష్ణణ్ణి పోలీసులు వెంటబెట్టుకుని రావడం, తల్లి తండ్రులు చూచి నిర్ఘాంతపొయ్యారు. నీ కొడుకు రైల్లో పర్సు కొట్టేశాడు. మీ యిల్లు సోదా చేయాలి అన్నారు పోలీసులు. సీత మావాడు అటువంటివాడు కాడు నాయనా అని ఏడవడం ప్రారంభించింది.

కష్టాల్లోనే కష్టాలు. వచ్చిన పోలీసులు అక్కడ వుండగానే పెళ్ళికి అప్పుచేసిన బాకీ షావుకారు యమధర్మరాజు చిత్రగుప్తుణ్ణి దూతలనూ వెంట వేసుకుని వచ్చినట్టు కోర్టు అమీనాను, వెట్టివాళ్ళను వెంటవేసుకుని ఇల్లుజప్తుచేయించటానికి వచ్చాడు. ఇదంతా చూసేసరికి శంకరం భార్యాభర్తలకు ఇల్లు నాలుగు మూలలూ ఒక్కసారే అంటుకున్నట్టయింది.

నాయికాభినయం

# వాసకసజ్జిక

నటరాజ రామకృష్ణ

"రాజనిభాననా! సరసురాలవు,
జబ్బుగా నల్లినా వదేమే జడ?"
'ఇంతకంటే వలెనే?'
'వలనొప్పు బిగించి యల్లవే
ఓ జవరాల! వేరొక పనియున్నది'
'దోసమె దోసమే చెలీ!
రాజగునట్టి యవ్విజయరాఘవు
మై చిగురాకే కోమలీ'

సాయం సమయము. సాంజె వెలుగులో ఆకాశమంతా అప్పుడే మెరుగుపెట్టిన బంగారు గోపురంలా తళతళ మెరిసిపోతోంది. కోట సింహద్వారమువద్ద మ్రోగింపబడుతున్న సన్నాయి మంగళవాయిద్యము సన్నగా వినబడుతూంది.

పట్టమహిషిగారి అంతఃపురము, అలంకారమందిరములో అద్దము ముందుగూర్చొని పైవిధముగా చెలికత్తియతో సంభాషించుచు, అలంకారమును ముగించుచున్నది. నాడు విజయరాఘవుడు పుట్టినరోజు. దేవిగారి మందిరమునకు వేంచేయుదురని వార్తనంపిరి. అందులకే ఈ తొందర.

* * *

రాజసభ పండిత కవి, గాయకులతో నిండి కిటకిటలాడుతూంది. దర్బారుహాలుకు చివరగానున్న నృత్యవేదిక మామిడాకు మొగలిరేకుల తోరణాలతో, చేమంతిదండలతో అలంకరించబడివుంది. రంగస్థలముపై రంగురంగుల పద్మములు, లతలూ, తీగెలముగ్గులు చిత్రించబడినవి.

రంగాజమ్మ విజయరాఘవుని పత్నియేగాక కవయిత్రి, నృత్యగానములందు అసమానపాండితీప్రతిభగల మేధావి. రచయిత్రి, తనచే రచింపబడిన "మన్నారుదాస విలాస" యక్షగానము తననాథునికి పుట్టినరోజు కానుకగా అంకిత మొసగుచున్నది. అంతియేగాక నాడు ఆ యక్షగాన ప్రథమ ప్రదర్శనము, అందు రంగాజమ్మ నాయిక పాత్రధరించి అభినయించుట కూడను. శుభముహూర్తమాసన్నమైన వెంటనే మంగళవాయిద్యములు మ్రోగుట మొదలిడినవి. పండితులు వేదములను పఠించుచుండిరి. ఒక సువర్ణపేటికలో నుంచిన ఆ గ్రంథమును, రంగాజమ్మ విజయరాఘవునకు సమర్పించింది. పండితులు మంగళాచరణములు చదివారు.

* * *

రాణివాసములో పట్టమహిషి తన అలంకారము ముగించుకొని అద్దము ముందు నిలబడి నునుతేత దీపకాంతిలో తనయొక్క సౌందర్యమును చూచి మురిసిపోవుచున్నది. శయ్యామందిరమును చెలికత్తెలు అలంకరించిన దానితో తృప్తినొందక